కాబోయే భర్తకి పెట్టిన పరీక్షలో ఆమె ఎలా ఓడిపోయింది?

# అమెరికా సంబంధం

సౌమర్ల లక్ష్మీరాజ్ కథ

చాలా విసుగ్గా వుంది అతనికి.

ఎయిర్‌పోర్ట్ లాంజ్‌లో అటూ ఇటూ పచార్లు చేస్తూ ఆలోచిస్తున్నాడు.

వచ్చి అరగంట పైనే అయింది. అక్క కారు పంపిస్తుంది అనుకున్నాడు. లేదు. ఫోన్ చేస్తే ఇంట్లో నో రెస్పాన్స్. బావగారి ఆఫీసుకి ఫోన్ చేస్తే ఏదో అర్జెంట్ పనిమీద ఊరు వెళ్లారుట. ఇల్లు లాక్ చేసుంటుంది.

"ఎన్నాళ్లు ఆ బ్రహ్మచర్య జీవితం గడుపుతావు. ఇక్కడ నీకో మంచి సంబంధం చూశాను. అమ్మాయి బావుంటుంది. ఒక్కసారి చూసి వెళ్లు. నా మాట కాదనవని ఆశిస్తూ"

అక్క.

ఆ ఉత్తరం అందుకున్న వెంటనే ఆఘమేఘాలపై పయనిస్తూ వచ్చేశాడు. అతని తల్లీ, తండ్రీ చిన్నప్పుడే పోయారు. అక్కే అన్నీ అయి పెంచి పెద్దచేసింది. చదువు పూర్తికాగానే మంచి ఉద్యోగం రావడంతో అమెరికా వెళ్లిపోయాడు.

'తనకీ బ్యాచులర్ లైఫ్ బోర్‌గా వుంది. పెళ్లిమీదకు మనసు పోతోంది. అందుకే అక్క మాటని మన్నించి వచ్చాడు.

తీరా వాళ్లు లేరు. ఏం చేయడమా అన్న ఆలోచనలో పడ్డాడు. ఏదో ఓ హోటల్‌లో రూం తీసుకుని గడపక తప్పదు అనుకున్నాడు.

అతను లగేజ్ తీసుకుని బయులుదేరేటప్పుడే... సడెన్‌గా ఓ అమ్మాయి డ్యాష్ ఇచ్చింది. తూలి పడబోయి నిలదొక్కుకుని కోపంగా



ఆమెవైపు చూశాడు.

ఆమె మాత్రం "అయాం సారీ! నన్ను అపార్థం చేసుకోకండి. చాలాకాలం తర్వాత మా ఫ్రెండ్ బొంబాయినుండి వస్తుందని తెలిసి వచ్చాను. తీరా ఫ్లయిట్ క్యాన్సిల్ అయిందని తెలిసింది. ఈ లోగా అదిగో... ఆ జీన్స్ ప్యాంట్ జులపాలగాడు నా వంకే చూస్తూ ఏవో సైగలు చేస్తున్నాడు. కాస్సేపు

నా మనిషిలా ప్రవర్తిస్తూ క్లోజ్‌గా మాట్లాడండి'' ప్రాధేయపడుతూ అడిగేసరికి కాదనలేకపోయాడు.

కొంచెం సేపు చూసి ఏమనుకున్నాడో ఏమో ఆ జులపాల జీన్స్‌ప్యాంట్ వెళ్లిపోయాడు.

అప్పుడు చూశాడు ఆమెవైపు. కంచి పట్టు లంగా ఓణీలో చాలా ముద్దుగా వుంది.

''అబ్బ! ఎన్నాళ్లయింది! ఇలాంటి బట్టల్లో ఆడపిల్లని చూసి'' అనుకున్నాడు.

''చాలా థాంక్స్! నా పేరు స్వప్న! మీ పేరు తెలుసుకోవచ్చా?'' మర్యాదగా అడిగింది.

''సుధీర్! అక్క అర్జంట్‌గా రమ్మని లెటర్ వ్రాస్తే ఇండియా వచ్చాను. తీరా వాళ్లు ఊళ్లో లేరు. హోటల్‌కి వెళదాం అనుకుంటున్నాను'' క్లుప్తంగా చెప్పాడు.

''ఓ... అయ్ సీ!'' అని సాలోచనగా అతనివైపు చూసింది.

''ముట్టుకుంటే మాసిపోతాడేమో అన్నంత సుకుమారంగా వున్నాడు'' అనుకుంటూ...

ఓ నిర్ణయానికి వచ్చినదానిలా ''మీకు అభ్యంతరం లేకపోతే మా ఇంటికి రండి. మీ అక్కగారు వచ్చాక వెళ్లిపోదురుగానీ... మా పేరెంట్స్ చాలా మంచివాళ్లు! వెరీ అండర్‌స్టాండింగ్'' ఆహ్వానించింది.

ఒక్క క్షణం ఆమె ధైర్యానికి విస్తుపోతూ ''నో! నో! ఫరవాలేదు!'' ఇబ్బందిగా అన్నాడు.

''ఏమిటీ? ఓ అపరిచితుడిని తొలి పరిచయంలోనే ఇంటికి పిలిచేస్తుందని ఆశ్చర్యపోతున్నారా? అన్నం వుడికిందో లేదో మెతుకు పట్టిచూస్తే తెలిసిపోతుంది. నా కళ్లకు మీరు మర్యాదస్తుల్లా మంచివాళ్లాగా కనిపిస్తున్నారు. అందుకే పిలిచాను. చక్కగా తెలుగు భోజనం తినాలనుకుంటే రండి. ఆపై మీ ఇష్టం'' సూటిగా అంది.

ఆమెవైపు చూశాడు. ఆ కళ్ళు నిర్మలంగా నవ్వుతూ ఆహ్వానిస్తున్నాయి. ''ఓకే'' అంటూ భుజాలు ష్రగ్ చేసి బ్యాగేజి అందుకున్నాడు. ఆమె కదిలింది.

మౌనంగా ఆమెను అనుసరిస్తూ అతను.

★ ★ ★

అతను ఆ ఇంటికొచ్చి ఒకరోజు పూర్తయింది. స్వప్న తల్లి, తండ్రి చాలా ఆప్యాయంగా చూసుకున్నారు. ఒక్కతే కూతురట. సంస్కారవంతుల్లా ప్రవర్తిస్తున్నారు.

కానీ ఎటొచ్చీ అతను కొంచెం ఇబ్బంది ఫీల్ అయ్యేది స్వప్నతోనే! చాలా కంగారు పిల్లలా వుంది. మనసులో ఏదీ దాచుకోకుండా మాట్లాడేసే భోళా స్వభావం అనుకున్నాడు.

ఆరోజు రాత్రి డిన్నర్ చేస్తోంటే ''మీకేమైనా హాట్‌డ్రింక్స్ అలవాటుంటే చెప్పండి. బాయ్‌చేత తెప్పిస్తాను'' అని అడిగేసరికి ముందు బిత్తరపోయాడు! బాప్‌రే అనుకుంటూ చప్పున 'నో' అనేశాడు.

అమెరికానుండి వచ్చాడని కాబోలు తనకిచ్చిన గెస్ట్‌రూంలో మైకేల్ జాక్సన్ హోరెత్తిపోతున్నాడు.

''చక్కటి తెలుగుపాటలు పెట్టండి. విని

చాలారోజులైంది'' అన్నాడు స్వప్నతో.

ఆమె ఆనందంగా అతన్ని చూస్తూ ''అరె! చెప్పారు కాదేం? మీకు తెలుగుభాష అంటే ఇష్టమున్నమాట'' అంటూ 'రోజా'లో పాట ఆన్ చేసి.

''తెలుగు పుస్తకాలు చదువుతారా? నా దగ్గర మంచి క్లాసిక్స్ ఉన్నాయి. నా అభిమాన రచయిత చలం. స్త్రీవాద సాహిత్యానికి శ్రీకారం చుట్టిన ఆద్యుడు. అతడి రచనలంటే పడి ఛస్తాను'' అంటూ అభిమానంగా ఘూట్లాడుతోంటే చిన్నగా నవ్వి ''నేను పెద్దగా బుక్స్ చదవను. అంత తీరిక వుండదు. ఎప్పుడైనా మనసు సేద తీర్చుకోవడానికి పాటలు వింటాను'' అనేసి నిద్రకుపక్రమించాడు.

''ఓకె గుడ్‌నైట్'' ఓరకంట అతన్నే చూస్తూ లైట్ ఆఫ్‌చేసి వెళ్లిపోయింది అక్కడినుండి.

సమయం ఎంతయిందో తెలీదు.

అర్ధరాత్రి అనుకుంటా! హఠాత్తుగా కరెంటు పోయింది. అసలే ఏ.సి అలవాటేమో. ఫ్యాన్‌గాలికూడా లేక అతనికి ఉక్కబోతగా వుంది. మెల్లగా చల్లగాలికోసమని రూం బయటకొచ్చాడు. అంతా కటిక చీకటి. చేతిలో అగ్గిపెట్టె అయినా లేదు. ''ఓరి భగవంతుడా! ఈ రాత్రి జాగారమేనా? అనుకుంటూ చీకట్లో ఓ అడుగు ముందుకు వేయబోయేసరికి -

దబ్బున ఏదో ఆకారం మీద పడింది. అతను వెల్లకిలా వెనక్కి పడిపోయాడు.

జాజుల వాసన నాసికకు తగిలేసరికి ఆ పడింది స్వప్న అని గ్రహించాడు.

ఆమె స్పర్శ అతన్ని ఏదో మైకంలోకి నెట్టేస్తోంది. ఒక్క క్షణం వివశుడైపోయాడు. అంతలో వివేకం తట్టిలేపింది. తనను తాను నిగ్రహించుకుంటూ ఎంతకీ మీదనుండి లేచే ప్రయత్నం చేయని ఆమెవైపు వింతగా చూస్తూ ''మీరు దయచేసి లేస్తే'' చెప్పలేక



ఆగిపోయాడు

ఆ పరిస్థితికి ఆమెకూడా సిగ్గుపడుతున్నట్లుగా ''నా కాలు బెణికినట్టుంది. అబ్బా! నొప్పిగా వుంది. చీకట్లో చూసుకోక పడిపోయాను. సారీ...'' అంటూ లేవబోయింది. కుంటుకుంటూ వెళ్లబోతే అతనే లేచి సాయపడుతూ ఆమెను జాగ్రత్తగా బెడ్‌మీదకు చేర్చాడు.

ఆ తరువాతి రోజే అతను తమ ఇంటికి వెళ్లిపోయాడు.

★ ★ ★

''ఏరా? ఎలా వుంది అమ్మాయి?! బావుందా? నీకు నచ్చిందా?'' రాగానే అక్క వేసిన ప్రశ్నకు విస్తుపోయి చూస్తూ ''అమ్మాయా? ఏ అమ్మాయి?'' ఎదురు ప్రశ్నించాడు అయోమయంగా.

''అదేరా? నిన్నంతా వాళ్లింట్లోనే వుండి వచ్చావుగా? ఆ పిల్లనే నీకు ఖాయం చేసింది. ఏదో అమెరికాలో వుండే కుర్రాడుకదా... కొంచెం చూస్తాను ఆంటీ'' అని అభ్యర్థిస్తే ఈ నాటకం ఆడాల్సి వచ్చింది'' అని వివరంగా చెబుతోన్న అక్కవైపు నిర్లిప్తంగా చూశాడు అతను.

అర్థమైపోయింది. అంటే ఆ అమ్మాయి తనను పరీక్షించదలచుకుందన్నమాట! దానికి ఈ పెద్దవాళ్ల సహకారం కూడాను'' ఒళ్లు మండుతోంది తలచుకుంటుంటే...

ముభావంగా ఫోన్‌వైపు నడుస్తోన్న తమ్ముడ్ని ఆశ్చర్యంగా చూసింది అతని అక్క.

★ ★ ★

''ఎస్! స్వప్నా హియర్'' రిసీవర్ లిఫ్ట్ చేస్తూ అంది.

''నేను!'' అతని కంఠం వినబడేసరికి ఆమె మనసు పురివిప్పిన నెమలిలా గంతులేయసాగింది.

''నీకు ఎవరైనా బాయ్‌ఫ్రెండ్స్ ఉన్నారా? ప్రేమ వ్యవహారాలు ఏమైనా నడిపావా? ఫరవాలేదు చెప్పు?... కాలుజారి అబార్షన్స్ గట్రా ఏవైనా అయ్యాయా? నీ ఎఫైర్స్ అన్నీ క్లియర్‌గా చెప్పేసెయ్?'' అవతలినుండి... అదీ అతన్నుండి ఆ మాటలు వెలువడేసరికి -

ఆమె అదిరిపడింది. ముందు నివ్వెరపాటు. ఆ వెనువెంటనే కోపం... ఆవేశం... అవమానం ముప్పిరిగొనగా నిలువెల్లా కంపించిపోతూ... ఎదురుగా అతనుంటే ఆ ఫోన్ వైరే అతని మెడకేసి చుట్టేసి చంపేద్దామన్నంత కసి వచ్చేసింది!

''ఏమిటీ! నన్ను మర్డర్ చేద్దామన్నంత ఆవేశం వచ్చిందా?'' అని అతనడిగేసరికి - ఉలిక్కిపడింది!

''చూశావా స్వప్నా! నేను నిన్ను పచ్చిగా అడిగేసరికి నీకు ఎంత కోపం వచ్చిందో. సరిగ్గా నువ్వు నన్ను అలాగే పరీక్షించావు. కాకపోతే కాస్త తెలివిగా అంతే! నీకు నామీద ఏమైనా అనుమానాలుంటే డైరెక్టుగా అడిగితే చెప్పేవాడినిగా? ఇంత డ్రామా ఎందుకు?'' తీవ్రంగా అతను ప్రశ్నిస్తోంటే...

అప్పుడు రియలైజ్ అయింది ఆమె. నిజమే! తనకి అతనిమీద అనుమానాలు వున్నట్టుగానే అతనికీ తనపైన సందేహాలు వుండవచ్చుగా? ఎంతసేపూ తనవైపునుండే ఆలోచించింది. అంతే తప్ప అతని

అభిప్రాయాలు కనుక్కోలేదు'' అనుకుంటూ -

''అయాం వెరీ సారీ! అర్థంలేని అనుమానాలతో వెధవ ప్రయోగాలు చేశాను!'' అంటోంటే ఆమెకు దుఃఖం ఎగదన్నుకు వస్తోంది. కళ్లు వర్షిస్తున్నాయి. ఆ కుర్రాడినే భర్తగా ఊహించుకుంది. అతనంటే మనసుపడింది.

కానీ హాఫ్ నాలెడ్జితో తను ఆడిన నాటకానికి అతను చచ్చినా ఇంక తనని చేసుకోడు. ఆమెకు నిర్ధారణ అయిపోయింది.

ఆ గొంతులో దుఃఖపు జీర స్పష్టంగా అతనికి వినపడింది.

''స్వప్నా! ఓ సంగతి చెప్పనా? మనది పితృస్వామ్య వ్యవస్థ. పురుషాహంకారానికి బలయిపోయే ఏ కొందరినో చూసి అందరు మగాళ్లని ఒకే గాటకు కట్టివేయడం సమంజసం కాదు. మీలాంటి యువతులు పురుషులపై తమ దృక్పథాన్ని మార్చుకోవాలి. చదువు, సంస్కారం, విచక్షణ ఉన్న ఏ పురుషుడైనా స్త్రీలాగే పవిత్రతకు, నైతిక విలువలకు ప్రాణం ఇస్తాడు. ఆఖరికి మీ చలంకూడా తన రచనల్లో స్త్రీ స్వేచ్ఛని ఆశించాడేతప్ప, పురుషుడిని ద్వేషించమని చెప్పలేదు'' అతని అభిప్రాయాలకు ముగ్ధురాలవుతూ వింటోన్న ఆమెకు ఆశ్చర్యంగా -

''స్వప్నా!'' మృధువుగా పలుకుతూ -

''నాకు నువ్వు బాగా నచ్చావు. మరీ ముఖ్యంగా ఆ చీకట్లో పడిపోవడం... అలాంటి అనుభవాలు మళ్లీ మళ్లీ కావాలి. నువ్వు ఊ అంటే రేపే మన పెళ్లి'' అనే సరికి ఆమె కళ్లు మళ్లీ వర్షించాయి ఆనందంతో.

## కోరిక



''భగవంతుడ్ని ఏమి కోరుకున్నారండీ'' అడిగింది నెలలు నిండిన భార్య తన పిసినారి భర్తను.

''ఆడపిల్ల పుట్టాలని''

''లోకంలో అందరూ మగపిల్లలు కావాలంటుంటే మీరేమిటి ఆడపిల్ల కావాలంటున్నారు''

''ఆడపిల్లయితే ఏభై, మగ పిల్లవాడయితే వంద రూపాయలు ఇవ్వమంటుందే నర్సు''

- మల్లిపూడి నాగేశ్వరరావు (కుమారదేవం)